సాక్షి నల్లగొండ

గురువారం । 27 । మార్చి । 2025




పర్యావరణాన్ని కాపాడేలా..

పర్యావరణాన్ని కాపాడేలా పంటలు సాగుచేయాలని కంపాసాగర్ కేవీకే కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. - 8లో



'నవోదయ' ఫలితాలు విడుదల

జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్‌వీ) ఆరు, తొమ్మిది తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. - 8లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-35 (గురువారం సా॥)

సహర్ 4-51 (శుక్రవారం ఉ॥)

న్యూస్‌రీల్

ఎస్సీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీగా ప్రేమ్‌కరణ్‌రెడ్డి



నల్లగొండ: జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రేమ్‌కరణ్‌రెడ్డి నియమితులయ్యారు. జిల్లా పరిషత్ సీఈఓగా పనిచేస్తున్న ప్రేమ్‌కరణ్‌రెడ్డికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన ఇన్‌చార్జి డీడీగా బాధ్యతలు స్వీకరించారు.

పదో తరగతి పరీక్షకు 29 మంది గైర్హాజరు

నల్లగొండ: జిల్లాలో 105 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం గణితం పరీక్షకు మొత్తం 18,666 మంది విద్యార్థులకు గాను, 18,637 మంది హాజరయ్యారు. 29 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ భిక్షపతి తెలిపారు.

దేవరకొండ ఆసుపత్రిలో కాయకల్ప బృందం



కాన్పుల వార్డును పరిశీలిస్తున్న బృందం

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని బుధవారం కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన కాయకల్ప బృందం సందర్శించింది. డాక్టర్ ప్రభు నేతృత్వంలోని బృందం సభ్యులు ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్, దయాలసిస్, మాతా శిశుసంరక్షణ కేంద్రం, జనరల్ ఓపీ, మెటర్నటీ, ఎమర్జెన్సీ విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, పరిశుభ్రత, నిర్వహణ, సిబ్బంది వివరాలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ బృందం అందించే నివేదిక ప్రకారం ఆసుపత్రిని కాయకల్ప అవార్డుకు ఎంపిక చేయనున్నారు. వారివెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రకాశ్, వైద్యులు కృష్ణ, రంజిత్, సిబ్బంది ఉన్నారు.

గోదాముల నిర్మాణానికి సబ్సిడీ ఇవ్వాలి



ఎఫ్‌సీఐ ఈడీ జెజింత లాజరస్‌తో డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్: ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాముల నిర్మాణానికి సబ్సిడీల సదుపాయం కల్పించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఎఫ్‌సీఐ రీజనల్ కార్యాలయంలో సౌతిండియా ఎఫ్‌సీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జెజింత లాజరస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాముల నిర్మాణం వల్ల రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకుని ధర ఎక్కువగా ఉన్నప్పుడు అమ్ముకుని లాభాలు ఆర్జించడానికి వీలుగా ఉంటుందని తెలిపారు. రైతులు దళారీల బారిన పడకుండా మద్దతు ధర పొందే అవకాశం ఉంటుందని ఈడీకి వివరించారు.

మెరుగైన వైద్యం అందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

చిట్యాల: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, డ్రగ్స్ స్టోర్, స్టాక్ రిజిస్టర్, కాన్పుల రూమ్‌ను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, పిల్లలకు సకాలంలో టీకాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహ, సీహెచ్‌ఓ కల్యాణచక్రవర్తి, హెల్త్ సూపర్‌వైజర్‌లు శ్యామల, లక్ష్మి, వీరారెడ్డి, స్టాఫ్ నర్స్ ప్రసన్నకుమారి, ఫార్మాసిస్ట్ హేమ, వైద్య సిబ్బంది వరలక్ష్మి, త్రివేణి, లక్ష్మి, పద్మావతి, మహేందర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం మాఫీ



నల్లగొండ టూటౌన్: మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90 శాతం మాఫీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని సంవత్సరాల నుంచి ఆస్తిపన్ను చెల్లించకుండా బకాయి పడ్డవారు ఈనెల 31లోగా మొత్తం ఆస్తిపన్ను చెల్లిస్తే 90 శాతం వడ్డీ రాయితీ అవకాశం కల్పించింది. ఇప్పటికే వడ్డీతో సహా ఆస్తిపన్ను చెల్లించిన వారికి వచ్చే ఏడాది 90 శాతం వడ్డీ తగ్గించనున్నారు. వెంటనే ఆస్తిపన్ను చెల్లించి వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిచాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ కోరారు.

వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు



నల్లగొండ టూటౌన్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14ఏళ్ల లోపు బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి పది వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడా శిక్షణ నిర్వాహకులకు గౌరవ వేతనంగా ఒక్కో శిబిరానికి రూ.4 వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. క్రీడా వివరాలు, గ్రామం, నిర్వహణ ప్రదేశం తెలియపరుస్తూ పూర్తి వివరాలతో వచ్చేనెల 5వ తేదీలోగా జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9440072854 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

స్కూళ్లలో ఒకరోజు శాస్త్రవేత్త



నల్లగొండ: విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా ప్రోత్సహించేందుకు అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఒకరోజు శాస్త్రవేత్త కార్యక్రమాన్ని నిర్వహించాలని డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులతో విద్యార్థులను ప్రత్యక్షంగా లేదా వర్చువల్ విధానంలో మాట్లాడించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి నివేదికను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏప్రిల్ 5లోగా సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి లక్ష్మీపతిని సంప్రదించాలని కోరారు.

పేపర్ లీకేజీకి రాజకీయ రంగు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య మాటల యుద్ధం

- కేటీఆర్‌పై కేసు నమోదుతో మరింత వేడెక్కిన రాజకీయం
- లీకేజీలో కాంగ్రెస్ నేతల హస్తం ఉందంటూ ఆరోపణలు
- కాంగ్రెస్ నేతల డ్రైవర్లు, అనుచరులే చేశారంటూ విమర్శలు



నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఈ నెల 21న పదో తరగతి తెలుగు పేపరు-1 ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరస్పర ఆరోపణలు, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శలతో జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో ఎమ్మెల్యే వీరేశం అనుచరుల పాత్ర ఉందని, వారిని కేసు నుంచి తప్పించేందుకే ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి చేశాడని చిరుమర్తి ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. పేపర్ లీకేజీలో ఎమ్మెల్యే అనుచరుల పాత్ర ఉందని, ఆయన ప్రధాన అనుచరుని పేరు ఎఫ్ఐఆర్‌లో లేదని, బీఆర్‌ఎస్ నాయకుడు మన్నెం క్రిషాంక్ ట్విట్టర్‌లో పోస్టు చేయగా, దానిని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్‌లో రీపోస్టు చేశారు. మరోవైపు బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొణతం దిలీప్ ఫార్వర్డ్ చేయడంతో కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. అంతేకాదు ఓ టీవీ చానల్‌తోపాటు, రెండు యూట్యూబ్ చానళ్లలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత, తాటికల్ పీఏసీఎస్ డైరెక్టర్ నకిరేకంటి నరేందర్, కాంగ్రెస్ నేత ఉగ్గిడి శ్రీనివాస్‌కు అరెస్టయిన నిందితులతో సంబంధాలు ఉన్నాయని, పేపరు లీకేజీతో వారికి సంబంధం ఉందంటూ ప్రసారం చేశారు. ఈ విషయంలో నిజాలను నిర్ధారించుకోకుండా వాటిని కేటీఆర్, క్రిషాంక్, దిలీప్ ట్విట్టర్‌లో తప్పుడు ప్రచారం చేయడంపై వారు నకిరేకల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

మాల్ ప్రాక్టీస్ కిందకే వస్తుందా?

పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్నాపత్రాన్ని ఫొటో తీసుకొని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యవహారం మాల్ ప్రాక్టీస్ కిందకు వస్తుందా? లీకేజీ కింద అన్న దానిపై విద్యాశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంలో పోలీసులు మాల్ ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఆ అంశం తెరపైకి వచ్చింది. పేపర్ లీక్ అయినట్లు కేసు నమోదు చేస్తే మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వస్తుందని, మాల్ ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేస్తే ఆ అవసరం ఉండదనే ఉద్దేశంతోనే మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేయవచ్చని విద్యాశాఖ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటోంది : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

పదో తరగతి పరీక్షలు సరిగ్గా నిర్వహించలేని చేతగాని ప్రభుత్వం నడుస్తోంది. పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటోంది. నకిరేకల్‌లో కేటీఆర్‌పై చిల్లర కేసు పెట్టారు. సీఎం డైరెక్షన్‌లోనే కేసు నమోదు చేశారు. ఈ కేసులో అసలు నిందితులను తప్పించారు.

వాళ్లకే లీకులు అలవాటు : ఎమ్మెల్యే వీరేశం

వారికే లీకేజీల అలవాటు ఉంది. గతంలో పల్లీ బటానీలకు అమ్ముకున్నారు. మాకు చదువు విలువ తెలుసు. దమ్ముంటే డైరెక్ట్‌గా ఎదుర్కోవాలి. పరీక్షల నిర్వహణకు ఒక సిస్టం ఉంటుంది. ఆ సిస్టంను అడిగితే అసలు విషయాలు బయటకు వస్తాయి. దళితులు అంటే వారికి ఈర్ష్య. నా పేరు తీస్తే దళిత సమాజం ఏమనుకుంటుందోనన్న భయం వారిలో ఉంది. అందుకే ఆకాశరామన్న పోస్టులు పెడుతున్నారు.

లీకేజీ వెనక ఎమ్మెల్యే హస్తం ఉన్నట్లు అనుమానం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుతోనే బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బుధవారం నల్లగొండలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్‌లో టెన్త్ ప్రశ్న పత్రం లీకేజీ కేసులో ఎమ్మెల్యే వీరేశం అనుచరులే ఉన్నారని, దాని వెనక ఎమ్మెల్యే హస్తం ఉన్నట్లు అనుమానం ఉన్నదని తెలిపారు. ఉగ్గిడి శ్రీనివాస్ ఎమ్మెల్యే డ్రైవర్ అని, దీని వెనక అసలు సూత్రధారున్ని ఆ కేసు నుంచి పోలీసులు తప్పించారని ఆరోపించారు. ఒక అమ్మాయిని బెదిరించి పేపర్ లీక్ చేసే ప్రయత్నం చేశారని అన్నారు. దిన పత్రికలో వచ్చిన క్లిప్పింగ్‌ను కేటీఆర్ షేర్ చేస్తే.. తప్పును సరిచేసుకోకుండా ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని లింగయ్య అన్నారు. ప్రశ్నపత్రం లీకేజీతో సంబంధంలేని కేటీఆర్‌పై ఎస్సీ ఎస్టీ కేసు, మరో రెండు కేసులు ఎలా పెడతారని ప్రశ్నించారు. ఇటీవల ఒక సందర్భంగా సీఎంకు స్వీట్ పెట్టబోతే నెట్టేసింది నిజం కాదా... సీఎంపై ఎందుకు ఎస్సీ ఎస్టీ కేసు పెట్టలేదో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్‌ఎస్ భయపడదని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కాంగ్రెస్ ఫిర్యాదు.. కేసు నమోదు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ:



నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఈనెల 21వ తేదీన జరిగిన పదో తరగతి తెలుగు పేపరు-1 లీకేజీ వ్యవహారంలో అరెస్టయిన బండి శ్రీను తన కారు డ్రైవర్ అని, బండి శ్రీనును తానే ప్రోత్సహించి నేరానికి ఉసిగొల్పినట్లుగా ఒక టీవీ చానల్‌తోపాటు, ఒక యూట్యూబ్ చానల్‌లో తప్పుడు ప్రచారం చేశారని నకిరేకల్ మండలం మర్రూరు గ్రామానికి చెందిన, తాటికల్ పీఏసీఎస్ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు నకిరేకంటి నరేందర్ పోలీసులకు ఈనెల 24న ఫిర్యాదు చేశారు. బండి శ్రీను తన కారు డ్రైవర్ కాదని, ఎస్సీ కులానికి చెందిన తనను అవమానించేలా, తన పేరు ప్రతిష్టలకు భంగం కలిగించేలా, తన రాజకీయ జీవితానికి కలంకం అంటగట్టేలా ఆ చానళ్లు తప్పుడు ప్రచారం చేశాయని పేర్కొన్నారు. నిజానిజాలను నిర్ధారించుకోకుండా.. కేటీఆర్, కొణతం దిలీప్ ట్విట్టర్‌లో ఫార్వర్డ్ చేశారని, వారంతా కుమ్మక్కై ఈ పని చేసినందున తగిన చర్యలు చేపట్టాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

- అదే కేసులో అరెస్టయిన చిట్ల ఆకాష్ తన కారు డ్రైవర్ అంటూ ఓ టీవీ చానల్‌తోపాటు యూట్యూబ్ చానల్ తప్పుడు ప్రసారం చేశాయని నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత ఈనెల 24న పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిట్ల ఆకాష్ తన కారు డ్రైవర్ కాదని పేర్కొన్నారు. పైగా ఆ నేరానికి పాల్పడేలా తానే ఉసిగొలిపినట్లు తప్పుడు వార్తను ఇచ్చారని పేర్కొన్నారు. సమాజంలో తన పేరు ప్రతిష్టలకు భంగం కలిగించేలా, తన రాజకీయ జీవితానికి కలంకం అంటగట్టేలా ఆ వార్తలు ఇచ్చారని వివరించారు. నిజానిజాలను నిర్ధారించుకోకుండా క్రిషాంక్, కేటీఆర్, దిలీప్ ట్విట్టర్‌లో ఫార్వర్డ్ చేశారని, వారిపై తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.
- ఈ కేసులోనే అరెస్టయిన ప్రైవేటు ఉపాధ్యాయుడు గుడుగుండ్ల శంకర్.. తాను నకిరేకల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల యజమానితో కుమ్మక్కై పేపర్ లీకేజీకి పాల్పడినట్లు టీవీ చానల్‌తోపాటు రెండు యూట్యూబ్ చానళ్లలో తప్పుడు వార్త ప్రసారం చేశారని ఉగ్గిడి శ్రీనివాస్ ఈనెల 25న ఫిర్యాదు చేశారు. ఆ వార్తల్లో నిజాలను నిర్ధారించుకోకుండా కేటీఆర్, క్రిషాంక్, దిలీప్ ట్విట్టర్‌లో ఫార్వర్డ్ చేశారని పేర్కొన్నారు. తన రాజకీయ జీవితానికి కలంకం అంటగట్టాలని చూశారని, వారిపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయా చానళ్లలోపాటు కేటీఆర్, క్రిషాంక్, దిలీప్‌పై పోలీసులు వేర్వేరు కేసులను నమోదు చేశారు. ప్రజల్లో ఆందోళన కలిగించే ఉద్దేశంతో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం, పుకార్లను వ్యాప్తి చేయడం వంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీలను లక్ష్యంగా చేసుకొని వారిపై ద్వేషం పెంచేలా ప్రచారం చేసినందుకు గాను ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ కింద కేసులను నమోదు చేసినట్లు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లలో పోలీసులు వివరించారు.

ఈ సెక్షన్ల కింద కేసు..

నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మన్నెం క్రిశాంక్ (ఏ1), కేటీఆర్(ఏ2), దిలీప్ కుమార్‌పై (ఏ3) బీఎన్ఎస్ 353(1)(సీ), 353(2) కింద కేసు నమోదు చేశారు. అలాగే ఉగ్గిడి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అవే సెక్షన్ల కింద కొణతం దిలీప్ (ఏ1), మన్నెం క్రిషాంక్ (ఏ2), కేటీఆర్‌పై (ఏ3), ఒక యూట్యూబ్ చానల్ ఎండీ (ఏ4), మరో యూట్యూబ్ చానల్ యాజమాన్యం (ఏ5)పై కేసులు నమోదు చేశారు. ఇక తాటికల్ పీఏసీఎస్ డైరెక్టర్ నకిరేకంటి నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పై సెక్షన్లతోపాటు ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ కింద కేటీఆర్ (ఏ1), కొణతం దిలీప్ (ఏ2), టీవీ, యూట్యూబ్ చానళ్ల మేనేజ్‌మెంట్‌పై (ఏ3) కేసులు నమోదు చేశారు.

పరీక్షలకు అనుమతించాలని హైకోర్టుకు..

- లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసిన టెన్త్ విద్యార్థిని ఝాన్సీలక్ష్మి
- ఏప్రిల్ 7న కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు హైకోర్టు ఆదేశాలు



బల్లెం ఝాన్సీలక్ష్మి

శాలిగౌరారం: నాకేపాపం తెలియదు.. ప్రశ్నాపత్రం లీకేజీలో నా పాత్రలేదు.. పరీక్షా కేంద్రంలో కిటికీ పక్కన ఉన్న నన్ను కిటికీలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి బెదిరించి నా ముందున్న ప్రశ్నాపత్రాన్ని సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకున్నాడు. నన్ను అన్యాయంగా డిబార్ చేశారు. నా డిబార్‌ను రద్దు చేసి పరీక్షలకు అనుమతించాలి అని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన పదో తరగతి విద్యార్థిని బల్లెం ఝాన్సీలక్ష్మి బుధవారం రాష్ట్ర హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయాన్ని ఆ విద్యార్థిని తల్లిదండ్రులు బుధవారం రాత్రి 'సాక్షి'కి వెల్లడించారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నల్లగొండ జిల్లా విద్యాధికారి, బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సెక్రటరీ, నకిరేకల్‌లోని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌లను ప్రతివాదులుగా పేర్కొంటూ న్యాయవాది కర్ణాకర్‌రెడ్డి ద్వారా లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశామని ఝాన్సీలక్ష్మి తల్లిదండ్రులు చెప్పారు. న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ తమ పిటిషన్‌ను విచారించి ఏప్రిల్ 7న కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీచేశారని చెప్పారు. ఈ నెల 21న ఎస్సెస్సీ పరీక్ష ప్రారంభం కాగా పరీక్షలు ప్రారంభమైన పావుగంటకే నకిరేకల్‌లోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో తెలుగు ప్రశ్నాపత్రం లీకై నకిరేకల్, శాలిగౌరారం మండలాలలోని యువకుల వాట్సాప్‌లలో చక్కర్లు కొట్టిన విషయం విదితమే. ప్రశ్నాపత్రం లీకైన సంఘటనను సీరియస్‌గా తీసుకున్న విద్యాశాఖ అధికారులు బాధ్యులను గుర్తించి నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రశ్నాపత్రం క్రమసంఖ్య నెంబర్ ఆధారంగా విద్యార్థిని ఝాన్సీలక్ష్మిని గుర్తించిన అధికారులు.. ఆమెను పరీక్షలకు హాజరు కాకుండా డిబార్ చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీలో పాల్గొన్న యువకులపై పోలీసులు కేసు నమోదు చేయడంతోపాటు కొందరిని రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- చింతపల్లి పీహెచ్‌సీ తనిఖీ



చింతపల్లి పీహెచ్‌సీలో మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చింతపల్లి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్లే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలు, ఇతర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొందరు ఇన్ పేషెంట్లు, అవుట్ పేషంట్లతో మాట్లాడి ఏ సమస్యతో ఆసుపత్రికి వచ్చారని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతకుముందు స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసి పిల్లలతో ముఖాముఖి మాట్లాడారు. తరగతి గదిలోకి వెళ్లి వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆ తర్వాత ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమై మండలంలో తాగునీటి సరఫరా, తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. హరిజనపురంలో కొత్త వాటర్ ట్యాంకు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ రమాకాంత్ శర్మ, వైద్యాధికారి శ్రీదేవి, మిషన్ భగీరథ ఏఈ ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

రేషన్ షాపులకు సన్న బియ్యం

- ఇప్పటికే 15 శాతం చేరవేత
- నెలాఖరులోగా ప్రక్రియ పూర్తికి యంత్రాంగం చర్యలు
- 30న సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభం





అధికారులతో జరిగిన చర్చల అనంతరం కలెక్టరేట్ వద్ద రేషన్ డీలర్లు, బియ్యం లోడ్ చేస్తున్న హమాలీలు

రేషన్ కార్డులు	4,66,552
యూనిట్లు	13,85,506
ప్రతినెలా పంపిణీ చేసే బియ్యం	8,877.999 మెట్రిక్ టన్నులు

నల్లగొండ: రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ఉమ్మడి జిల్లాలోనే ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈనెల 30న సూర్యాపేట జిల్లా మట్టపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుడతారు. ఇందులో భాగంగా జిల్లా యంత్రాంగం గోదాముల నుంచి రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో ఎఫ్ఎస్‌సీ కార్డుదారులకు ఒక్కొక్కరికి ఆరు, ఏఎఫ్ఎస్‌సీ కార్డుదారులకు 35, అన్నపూర్ణ కార్డుదారులకు కార్డుకు 10 కిలోల చొప్పున రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఇవ్వనున్నారు. ప్రతినెలా 8,877.999 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్ షాపులకు పౌరసరఫరాల శాఖ అందించనుంది.


30లోగా పూర్తిచేసేలా..

ఈనెల 30న ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీని ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు సన్న బియ్యాన్ని రేషన్ షాపులకు తరలిస్తున్నారు. ఇప్పటికే 15 శాతం బియ్యం రేషన్ షాపులకు చేరుకున్నాయి. అధిక వాహనాలను ఏర్పాటు చేసి 30 లోగానే పూర్తి స్థాయిలో బియ్యాన్ని రేషన్ షాపులకు చేరవేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

తూకం వేసి ఇవ్వాలంటున్న డీలర్లు

ఇన్నాళ్లు ప్రభుత్వం దొడ్డు బియ్యాన్ని రేషన్ షాపుల్లో పేదలకు అందిస్తూ వచ్చింది. వచ్చే నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనుంది. అయితే ఇన్నాళ్లు దొడ్డురకం బియ్యాన్ని తూకం వేయకుండానే 50 కిలోల బస్తా చొప్పున లెక్కించి రేషన్ షాపులకు ఎన్ని క్వింటాళ్ల బియ్యం ఇవ్వాలో అలాట్‌మెంట్ ఇచ్చేవారు. ఈ క్రమంలో ఒక్కో బస్తాకు రెండు కిలోల చొప్పున తరుగు వస్తుందని, దీంతో తాము నష్టపోవాల్సి వస్తుందని, గోదాముల వద్ద తూకం వేసి ఇవ్వాలని డీలర్లు ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తున్నా హమాలీలు, యంత్రాల కొరత కారణంగా అమలు చేయడం లేదు. అయితే వచ్చే నెల నుంచి అన్ని రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తే కార్డుదారులంతా తీసుకుంటారని, తమకు బస్తాలు తూకం వేసి ఇవ్వకపోతే బస్తాకు 2 కిలోల చొప్పున ఒక లోడ్‌కు 2, 3 క్వింటాళ్ల వరకు తరుగు వచ్చి నష్టపోతామని రేషన్ డీలర్లు అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రభుత్వంలోనైనా తూకం వేసి ఇవ్వాలని బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన చర్చల్లో సివిల్ సప్లయ్ డీఎం హరీష్‌కు రేషన్ డీలర్లు విన్నవించారు.


తరుగు రాకుండా చూస్తాం



రేషన్ బియ్యం తూకంలో తేడా వస్తుందని మా దృష్టికి డీలర్లు తీసుకొచ్చారు. గోదాముల్లో తూకం వేసే ఇవ్వాలని చెప్పాం. డీలర్ల కోరిక మేరకు కొంతకాలం బయట వే బ్రిడ్జిపై తూకం వేసి ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. బస్తాల్లో తరుగు రాకుండా చూస్తాం.

– హరీష్, పౌర సరఫరాల శాఖ డీఎం, ఇన్‌చార్జి డీఎస్‌ఓ నల్లగొండ

తూకం వేసి ఇవ్వాలి



రేషన్ బియ్యం తూకం వేసి ఇవ్వాలని కొంత కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అయినా స్పందన లేదు. ప్రస్తుతం సన్న బియ్యం ఇవ్వనున్న నేపథ్యంలో గోదాముల వద్దే బస్తాలు తూకం వేసి తరుగు రాకుండా, డీలర్లు నష్టపోకుండా చూడాలి.

– నాగరాజు, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు

ఏపూరులో బడిబాట



బడిబాట ర్యాలీని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ చిట్యాల మండలం ఏపూరు జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు బుధవారం ఉదయం గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం సబీహా ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వలిగొండ సునిత, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, నర్సయ్య, వహీద్, లీలావతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. బుధవారం చిట్యాల ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన కత్తుల అఖిల్(25) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అతడు బైక్‌పై హైదరాబాద్ నుంచి నల్లగొండకు వస్తుండగా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే హైదరాబాద్‌నుంచి ఖమ్మం జిల్లా మధిరకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అఖిల్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి మంగమ్మ బుధవారం చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

నూతనకల్: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడడంతో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన నూతనకల్ మండలం మిర్యాల గ్రామ శివారులో బుధవారం జరిగింది. ఎస్‌ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన క్లైపల్లి పవన్ తన బావమరిది బొప్పాని రిషి(10)తో కలిసి బైక్‌పై చిననెమిల క్రాస్ రోడ్డు వైపు వెళ్తుండగా.. మిర్యాల గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనకాల కూర్చున్న రిషి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేటకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా బైక్ నడిపిన క్లైపల్లి పవన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టిక్కెట్ మిషన్ పనిచేయక నిలిచిన ఆర్టీసీ బస్సు

మోత్కూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన ఆర్టీసీ బస్సు టిక్కెట్ మిషన్ పనిచేయకపోవడంతో బుధవారం మధ్యాహ్నం మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాపురం వద్ద నిలిచిపోయింది. ఈ బస్సు మోత్కూరు, అనాజిపురం, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉంది. బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉండగా తొర్రూరులో ఎక్కిన ప్రయాణికులకు టిక్కెట్లు ఇచ్చారు. కానీ మోత్కూరు వద్ద ఎక్కిన ప్రయాణికులకు టిక్కెట్లు ఇవ్వలేకపోయారు. టిక్కెట్లు ఇవ్వకుండా ప్రయాణికులకు తీసుకెళ్లలేమని కండక్టర్ తెలిపారు. బస్సు నిలిచిపోవడంతో ఎండలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్–2 డిపో మేనేజర్‌ను సంప్రదిస్తే టిక్కెట్లకు బదులుగా పేపర్‌పై రాసి ఇవ్వాల్సిందిగా కండక్టర్‌కు సూచించారు. దీంతో గంటన్నర తరువాత బస్సు హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లింది.

‘నవోదయ’ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

- ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు 80 మంది
- తొమ్మిదో తరగతికి 11 మంది ఎంపిక

పెద్దవూర: పెద్దవూర మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్‌వీ)లో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి గాను నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ కేవీ నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతికి 80మంది విద్యార్థులు, తొమ్మిదో తరగతికి 11మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి అడ్మిషన్ ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను పూర్తిగా నింపి అవసరమైన అన్ని సర్టిఫికెట్లను ఏర్పాటు చేసుకుని డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రవేశానికి సంబంధించిన అన్ని ఫారాలను దరఖాస్తు సమయంలో విద్యార్థులు పొందుపర్చిన చిరునామాకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపనున్నట్లు తెలిపారు.


చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం

ఆరో తరగతికి ఎంపికైన విద్యార్థుల హాల్‌టిక్కెట్ల నంబర్లు ఇవీ..

ఎన్3612880, జే3612939, జే3613798, ఎల్3614099, ఎల్3615167, ఎల్3615247, ఈ3615345, కే3615353, జే3612100, జే3612885, జే3613021, ఎన్3613056, జే3615510, కే3612418, కే3613797, ఓ3615174, జే3612099, ఎన్3612810, పీ3615188, పీ3615245, జే3611651, కే3612005, ఐ3612025, ఎన్3612082, జే3612095, ఎం3612189, ఎం3612205, జే3612614, ఎల్3612684, జే3612935, జే3613071, జే3613516, జే3613595, ఎన్3613632, ఓ3613790, జే3613909, ఎల్3613947, జే3614077, జే3614279, జే3614369, జే3615170, ఎల్3615177, ఎన్3615302, ఎం3615534, ఎన్3615757, కే3616005, జే3616054, జే3612097, జే3612297, జే3612971, ఎన్3613114, ఎన్3613189, ఎన్3614220, జే3614222, జే3614360, జే3614944, జే3615001, జే3615117, ఎన్3615195, జే3615317, ఎన్3615485, జే3615976, జే3616031, కే3612119, కే3612345, ఓ3612955, కే3613362, ఓ3614631, కే3614747, కే3615019, కే3615867, కే3615992, కే3616067, పి3612748, ఎల్3615157, పి3615194, పి3615203, పి3615219, ఎల్3615250, పి3615367.

తొమ్మిదో తరగతికి ఎంపికైన విద్యార్థుల హాల్‌టిక్కెట్ల నంబర్లు..

342075, 342215, 341978, 342267, 342121, 342002, 342120, 341595, 341761, 342096, 342173.

పోలీసుల అదుపులో నగల షాపు యజమాని

- అధిక వడ్డీ ఆశచూపి పలువురి వద్ద డబ్బులు, నగదు తీసుకొని పరార్

యాదగిరిగుట్ట: అధిక వడ్డీ ఆశచూపి యాదగిరిగుట్ట పట్టణంలోని పలువురి వద్ద నగదు, నగలు తీసుకొని పరారైన స్థానిక జైభవానీ జువెల్లర్స్ యజమానిని ఎట్టకేలకు బుధవారం పోలీసులు పట్టుకున్నారు. యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 24న సుమారు రూ.10కోట్లతో జైభవాని జువెల్లరీ యజమాని జితేందర్‌లాల్‌తో పాటు మధు రాములు అనే వ్యక్తి పరారయ్యారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో జితేందర్‌లాల్‌పై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కాగా బుధవారం జితేందర్‌లాల్, మధు రాములు చిట్యాలలో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఒక కేజీ 85 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు. మరో కేజీ 946 గ్రాముల బంగారం బ్యాంక్‌లో ఉన్నట్లు గుర్తించి సీజ్ చేయించారు. అంతేకాకుండా జితేందర్‌లాల్, మధు రాములు వద్ద ఉన్న 64కిలోల 620గ్రాముల వెండి ఆభరణాలతో పాటు కారును సైతం సీజ్ చేశారు. బంగారం, వెండి ఆభరణాలను కోర్టులో డిపాజిట్ చేయనున్నట్లు సీఐ తెలిపారు. జితేందర్‌లాల్, మధు రాములును రిమాండ్ చేశామని వెల్లడించారు. జితేందర్‌లాల్‌ను పోలీసులు పట్టుకున్న విషయం తెలుసుకున్న బాధితులు భారీగా యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తమ బంగారంతో పాటు నగదును త్వరగా ఇప్పించాలని బాధితులు సీఐ రమేష్‌ను కోరారు.


జితేందర్‌లాల్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

మోత్కూరు: వేర్వేరు చోట్ల ముగ్గురు యువకులు బలవన్మరణానికి పాల్పడ్డారు. మోత్కూరు మండలం దత్తప్పగూడేనికి చెందిన యువకుడు తండ్రి మందలించాడని మనస్తాపానికి గురై సెల్‌ఫోన్ క్లీనింగ్ చేసే లిక్విడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. దత్తప్పగూడెం గ్రామానికి చెందిన సీలం సిల్వరాజ్ రెండో కుమారుడు ప్రజ్వల్ (20) గ్రామంలో మొబైల్ రిపేర్ పనులు చేసుకుంటూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. మంగళవారం ప్రజ్వల్‌ను తండ్రి సిల్వరాజ్ మందలించాడు. మనస్తాపానికి గురైన ప్రజ్వల్ బుధవారం సెల్‌ఫోన్ క్లీనింగ్ చేసే లిక్విడ్ తాగాడు. కుటుంబ సభ్యులు భువనగిరి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.


ప్రజ్వల్ (ఫైల్)

మానసికస్థితి సరిగా లేని..

నడిగూడెం: మానసికస్థితి సరిగా లేని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం నడిగూడెం మండల కేంద్రం పరిధిలో జరిగింది. ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన దేవరంగుల లక్ష్మయ్య, భద్రమ్మ దంపతుల పెద్ద కుమారుడు యల్లయ్య(39)కు కొద్దిరోజులుగా మానసిక స్థితి సరిగ్గా ఉండటంలేదు. బుధవారం యల్లయ్య నడిగూడెం నుంచి కలకోవకు వెళ్లే రహదారిలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలాల వద్దకు వెళ్తున్న వారు చూసి యల్లయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య వనజ, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


యల్లయ్య (ఫైల్)

అదృశ్యమైన యువకుడు శవమై..

రాజాపేట: ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం మల్లగూడెం గ్రామానికి చెందిన రెడ్డబోయిన మల్లేష్, లావణ్య దంపతుల పెద్ద కుమారుడు హరిబాబు(19) శుక్రవారం ఇంటి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి మల్లేష్ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా బుధవారం కొండ్రెడ్డి చెరువు, మల్లగూడెం గ్రామాల శివారు ప్రాంతంలో హరిబాబు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. పరిసర ప్రాంత రైతు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


హరిబాబు (ఫైల్)

‘పది’ పరీక్ష కేంద్రం వద్ద చిట్టీల కలకలం

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం జి.తిర్మలగిరి జెడ్పీహెచ్‌ఎస్ పరీక్ష కేంద్రంలో బుధవారం పదో తరగతి మ్యాథ్స్ పరీక్ష రాస్తున్న విద్యార్థులకు కొందరు చిట్టీలు అందించినట్లు సమాచారం. ఈ పాఠశాలలో జి.తిర్మలగిరి, తిమ్మాపురం, దురాజ్‌పల్లి, గుంజలూరు, ఖాసీంపేట గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలతో పాటు దురాజ్‌పల్లిలోని ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన 136 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కాగా ముస్లిం మైనార్టీ పాఠశాలకు చెందిన కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలకు 500 మీటర్ల దూరంలో కారులో కూర్చొని చిట్టీలు పాఠశాలకు పంపిస్తుండటంతో విలేకరులు గమనించి ఫొటోలు తీస్తుండగా అక్కడ నుంచి పరారయ్యారు. ఈ విషయమై మండల విద్యాధికారి రమణ, పరీక్ష కేంద్రం చీఫ్ మిర్యాల అమృతారెడ్డిని వివరణ కోరగా.. పాఠశాలలోకి ఎలాంటి చిట్టీలు రాలేదన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు.


పరీక్ష కేంద్రానికి సమీపంలో ఆగి ఉన్న కారులోని చిట్టీలు

సూర్యక్షేత్రం వ్యవస్థాపకుడు జనార్దన్ స్వామి మృతి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణ స్వామి క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి అలియాస్ జనార్దన్ స్వామి (46) బుధవారం రాత్రి మృతిచెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జనార్దన్ స్వామి 2002లో తిమ్మాపురం శివారులో గుట్టల మధ్యన రాష్ట్రంలోనే మొదటిదైన సూర్యక్షేత్రాన్ని తన సొంత ఖర్చులతో నిర్మించారు. దీని నిర్మాణానికి సుమారు రూ.2కోట్లకు పైగానే ఖర్చు చేశారు. జనార్దన్ స్వామి స్వగ్రామం తుంగతుర్తి మండలం సంగెం గ్రామం కాగా హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసముంటున్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. హయత్‌నగర్ సమీపంలోని శ్మశానవాటిక నందు గురువారం అంత్యక్రియలు జరుగుతాయని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.


జనార్దన్ స్వామి (ఫైల్)

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నూతనకల్: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన నూతనకల్ మండలం లింగంపల్లిలో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. లింగంపల్లి గ్రామానికి చెందిన కారింగుల లక్ష్మణ్(22) విద్యుత్ లైన్‌మెన్ కుర్వా వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలోని ఓ వీధిలో విద్యుత్ లైన్ తెగి వేలాడుతుందని గ్రామానికి చెందిన రవి లైన్‌మెన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా.. లైన్‌మెన్ సూచన మేరకు లక్ష్మణ్ ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి విద్యుత్ లైన్ సరిచేసేందుకు స్తంభం ఎక్కాడు. స్తంభం పైనుంచి 11కేవీ లైన్ ఉండటంతో విద్యుత్ సరఫరా అవుతుందా లేదా అని లక్ష్మణ్ టెస్టర్‌తో చెక్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్‌ని వివరణ కోరగా.. విద్యుత్ లైన్‌మెన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసేందుకు గాను సబ్ స్టేషన్‌లో స్కిల్డ్ లేబర్‌గా పేరు నమోదు చేసుకోవాలని, కానీ లక్ష్మణ్ సబ్ స్టేషన్‌లో ఎటువంటి పేరు నమోదు చేసుకోలేదని పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధుడు..

చివ్వెంల(సూర్యాపేట): ప్రమదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండలం తుల్జారావుపేట గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుల్జారావుపేట గ్రామానికి చెందిన బానోతు సీతారాం(75) రోజుమాదిరిగానే బుధవారం కూడా తన పశువులను మేపేందుకు గ్రామ శివారులోని తుమ్మల చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పశువులు చెరువులోకి దిగాయి. వాటిని బయటకు తోలుకొచ్చేందుకు సీతారాం చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. మృతుడి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాదగిరీశుడి హుండీ ఆదాయం రూ.4.43కోట్లు


హుండీల్లో భక్తులు సమర్పించిన నగదు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలను బుధవారం కొండకు దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి సమక్షంలో ఆలయాధికారులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.4,43,04,995 నగదు వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. మిశ్రమ బంగారం 296 గ్రాములు, మిశ్రమ వెండి 13 కిలోలు వచ్చిందని వెల్లడించారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, యూఏఈ, నేపాల్, సౌదీ అరేబియా, సింగపూర్, ఖతార్, ఒమన్, కెనడా, మలేషియా, కువైట్, న్యూజిలాండ్, భూటాన్, ఇండోనేషియా, నైజీరియా, శ్రీలంక, థాయిలాండ్, క్రోనర్, మారిషస్, పోలాండ్ దేశాలకు సంబంధించిన కరెన్సీ కూడా హుండీల్లో లభించాయని ఈఓ తెలిపారు. ఈ హుండీ ఆదాయం 65 రోజులదని ఆయన పేర్కొన్నారు.

నకిలీ బంగారం విక్రయం

- ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అరెస్ట్

ఆత్మకూర్ (ఎస్): తక్కువ ధరకు బంగారం ఇస్తానని చెప్పి నకిలీ బంగారాన్ని అంటగట్టే ప్రయత్నం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి నెమ్మికల్ గ్రామంలోని గంగరబోయిన శ్రీనివాస్ ఇంటికి వచ్చి తన వద్ద బంగారం ఉందని, తక్కువ ధరకే ఇస్తానని బేరం ఆడాడు. అతడి వ్యవహారాన్ని చూసిన శ్రీనివాస్ అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వచ్చి సదరు వ్యక్తి వద్ద ఉంది నకిలీ బంగారంగా గుర్తించి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

హాలియా: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చని అమెరికా దేశానికి చెందిన ఇంజనీర్లు క్రీస్, ధరోట అన్నారు. శ్రీశైలం దేవాలయాన్ని దర్శించుకున్న వారు తిరుగు ప్రయాణంలో మార్గమధ్యలో బుధవారం హాలియా పట్టణంలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇక్కడ అమలవుతున్న విద్యావ్యవస్థ గురించి ఆరా తీసి పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థి దశ నుంచే భాషపై పట్టు ఉన్నట్లయితే కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. వారి వెంట పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు మోదాల రవీందర్, ఎన్. గోపినాయర్, మహమ్మద్ కరీం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.


విద్యార్థులతో అమెరికాకు చెందిన ఇంజనీర్లు క్రీస్, ధరోట

పర్యావరణాన్ని కాపాడేలా పంటలు సాగు చేయాలి

- ఉమ్మడి జిల్లాలోని రైతులకు వరి విత్తే విధానంపై శిక్షణ


త్రిపురారం: పర్యావరణాన్ని కాపాడేలా పంటలు సాగు చేయాలని త్రిపురారం మండలం కంపాసాగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కంపాసాగర్ కేవీకేలో ఉమ్మడి జిల్లాలోని రైతులకు వరి విత్తనాలు నేరుగా విత్తే విధానం–యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వరి విత్తనాలను నేరుగా విత్తుకోవడం ద్వారా కూలీల కొరత, శ్రమ, పెట్టుబడి తగ్గడంతో పాటు చీడపీడలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. వరి పంటను దమ్ము చేసి పండించడం వల్ల మీథేన్ గ్యాస్ విడుదల అవుతుందని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సుస్థిరంగా ఉత్పాదకత ఎలా చేపట్టాలి, యాంత్రాలను ఏవిధంగా ఉపయోగించాలి, సేంద్రియ వ్యవసాయం, సమతుల్య ఎరువుల యాజమాన్యం, నేలలో సేంద్రియ కర్బనాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వరి పరిశోధన స్థానం హెడ్ లింగయ్య, త్రిపురారం మండల వ్యవసాయాధికారి పార్వతి చౌహాన్, డాక్టర్ చంద్రశేఖర్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు వరి విత్తనాలు నేరుగా విత్తే విధానంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

సేంద్రియ పద్ధతిలో విభిన్న పంటల సాగు

- సుమారు 11 ఎకరాల్లో మామిడి తోట పెంపకం
- అందులో అంతర పంటలుగా వేరుశనగ, పుచ్చకాయ, మినుములు, పెసర, వక్క, రుద్రాక్ష సాగు
- ఆకుకూరలు, కూరగాయలు కూడా..
- సాగు నీటి కొరతను అధిగమించడానికి డ్రిప్, ఫాంపాండ్, రెయిన్ గన్‌ల ఏర్పాటు
- యూట్యూబ్‌లో చూసి సాగు చేపట్టిన శైలజారెడ్డి

ఆత్మకూరు(ఎం): ఆమెకు సేంద్రియ వ్యవసాయం చేయడమంటే ఇష్టం. సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు పండిస్తే భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆమె ఆలోచన. దీంతో యుట్యూబ్‌లో చూసి సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం నేర్చుకుంది. తమకున్న వ్యవసాయ భూమిలో భర్త ప్రోత్సాహంతో సేంద్రియ పద్ధతుల్లో వివిధ రకాల పంటలు సాగు చూస్తూ సక్సెస్ అయ్యింది.


తోటలోని ఫాంపాండ్


నాటడానికి తెచ్చిన మొక్కలకు సేంద్రియ ఎరువు వేస్తున్న రైతు శైలజారెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన కొప్పుల శైలజారెడ్డి, కృపాకర్‌రెడ్డి దంపతులకు గ్రామంలో 15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కృపాకర్‌రెడ్డి వ్యాపారం చేస్తుంటాడు. వీరికున్న భూమిలో 4 ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. మిగతా 11 ఎకరాల్లో సేంద్రియ పద్ధతుల్లో పండ్ల తోటలు, ఆకుకూరలు, కూరగాయలు సాగును చేయాలని శైలజారెడ్డికి ఆలోచన రాగా భర్త కృపాకర్‌రెడ్డి సహకరించాడు. దీంతో గతేడాది 11 ఎకరాల్లో మామిడి తోట పెట్టారు. ఈ తోటలో మహాగని, గోల్డెన్ మ్యాంగో, థాయ్‌లాండ్, మ్యాన్‌డాక్, ఆపిల్ బేర్ రకాలతో పాటు అంతర పంటలుగా నాలుగు ఎకరాల్లో వేరుశనగ, మూడెకరాల్లో పుచ్చకాయ, దీంతో పాటు మినుములు, పెసర, పోక చెక్క, రుద్రాక్ష, బ్లాక్‌బేర్, మహాబిల్వం మొక్కలను సాగు చేస్తున్నారు. అంతేకాకుండా బ్రెజిల్ పాలకూర, చిక్కుడు, వంకాయ, కాశీ టమాట, చెర్రి టమాట, చిక్కుడు, సోరకాయతో పలు రకాల ఆకుకూరలు, కూరగాయలు కూడా సాగు చేస్తున్నారు.


తోటలోని మొక్కలకు ఏర్పాటు చేసిన షేడ్ నెట్

ఫాంపాండ్, డ్రిప్ సహాయంతో..

ఈ 11 ఎకరాల్లో భూసారం దెబ్బతినకుండా శైలజారెడ్డి జాగ్రత్తలు తీసుకుంటోంది. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా వివిధ రకాల ఆకులతో తయారుచేసిన జీవామృతం, వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేస్తోంది. నాలుగు బోర్లు మాత్రమే ఉండటం, అవి కూడా అంతంత మాత్రంగానే పోస్తుండడంతో నీటి కొరతను అధిగమించడానికి ఫాంపాండ్ నిర్మాణం, డ్రిప్ ఏర్పాటు కోసం ఉద్యానశాఖకు దరఖాస్తు చేయగా రూ.75వేల సబ్సిడీతో రూ.5లక్షల రుణం మంజూరు అయ్యింది. దీంతో తోటలో డ్రిప్ ఏర్పాటుతో పాటు ఫాంపాండ్ నిర్మాణం చేశారు. బోరు నుంచి వచ్చిన నీటిని ఫాంపాండ్‌లో నిల్వ చేస్తున్నారు. ఫాంపాండ్ నుంచి డ్రిప్ సహాయంతో మొక్కలకు నీరు అందిస్తున్నారు. జీవామృతం, వర్మీ కంపోస్టు ఎరువులను కూడా డ్రిప్ ద్వారానే మొక్కలకు అందిస్తున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి



సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసేలా రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సహించాలి. సబ్సిడీపై రుణాలు అందించాలి. సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పించాలి. సేంద్రియ పద్ధతితో పండించిన ఆహార పదార్థాలను తింటే ఆరోగ్యం కూడా బాగుంటుంది. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడానికి ముందుకొచ్చే రైతులకు అవగాహన కల్పిస్తాను.

– కొప్పుల శైలజారెడ్డి

రెయిన్ గన్‌ల ఏర్పాటు

మామిడి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న వేరుశనగ, పుచ్చకాయ, మినుములు, పెసర, పోక చెక్క పంటలకు నీరు అందించడానికి రెయిన్ గన్‌లను ఏర్పాటు చేశారు. ఒక్క రెయిన్ గన్ సుమారుగా 30 మీటర్ల దూరం వరకు నీటిని వెదజల్లుతుంది. కోతుల బెడద నుంచి రక్షించుకోవడానికి తోట చుట్టూ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. తాము 11 ఎకరాల్లో పంటలను పూర్తిగా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నామని, ప్రభుత్వం నుంచి ఆశించిన ప్రోత్సాహం ఉంటే రైతులు సేంద్రియ పద్ధతిలో పంటల సాగుకు ముందుకొస్తారని శైలజారెడ్డి అంటున్నారు.


మామిడి తోటలో ఏర్పాటు చేసిన రెయిన్ గన్స్